■ పాహిమాం.. పరమేశ్వరి



జిల్లావ్యాప్తంగా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరులో అంబికాదేవి బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కోర్టు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, అక్టోబరు 3 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయవాదుల అమైండ్‌మెంట్ బిల్లు 2024ను నిరసిస్తూ ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం ఏలూరులో ఉన్న అన్ని కోర్టుల విధులను బహిష్కరించారు. సీనియర్ న్యాయవాదులు ఏడాదికి 12 కేసుల వకాల్తాలు కాని లేదా వారి పేరుపైన ఐదు జడ్జిమెంట్‌లు ఉండాలని జూనియర్ న్యాయవాదులు ఏడాదిలో కనీసం ఐదు వకాల్తాలు కోర్టులో ఉండాలన్న నిబంధనలను నిరసించారు. ఈ మేరకు గురువారం, శుక్రవారం కోర్టులు బహిష్కరించడానికి ఏలూరు బార్ అసోసియేషన్ నిర్ణయించిందని ఏలూరు బార్ అధ్యక్షులు కోనే సీతారామ్ తెలిపారు.

టీచర్ సస్పెన్షన్, ప్రిన్సిపాల్ సరెండర్

బుట్టాయగూడెం, అక్టోబరు 3 : బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఔట్ సోర్సింగ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జె.మురళీకృష్ణను ఐటీడీఏ పీవో, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయాన్ని ఐటీడీఏ డీడీ పీవీఎస్ నాయుడు తెలిపారు. 'గురుకులంలో ఒక ఇంటర్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదుపై విచారణ తర్వాత మురళీకృష్ణను సస్పెండ్ చేసి, విధుల నుంచి తొలగించాలని గురుకులం కార్యదర్శికి నివేదిక పంపించాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని గురుకులం కార్యదర్శికి సరెండర్ చేశాం. కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించామ'న్నారు.

టీడీఆర్ బాండ్‌లపై.. ఉక్కుపాదం!



వైసీపీ హయాంలో తణుకు మునిసిపాలిటీ మంజూరు చేసిన టీడీఆర్ బాండ్‌లపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. గజాల్లో బాండ్‌లు చేయడాన్ని తప్పు పట్టింది. వ్యవసాయ భూముల పేరుతో బాండ్‌లు ఇవ్వాలని స్పష్టం చేసింది. మరోవైపు గతంలో జారీచేసిన బాండ్‌లపై సీబీసీఐడీ రంగంలోకి దిగింది. విజిలెన్స్ విచారణ చేపడుతున్నారు. వివరాలను సేకరిస్తున్నారు.

- తణుకులో రూ.900 కోట్ల బాండ్‌లు మంజూరు
- వైసీపీ హయాంలో దందా నడిపిన ఆ పార్టీ నేత
- మునిసిపాలిటీకి 21 ఎకరాలు సేకరణ
- బ్లాక్ లిస్ట్‌లో బాండ్‌లు పెట్టిన ప్రభుత్వం
- వ్యవసాయ భూములుగా బాండ్‌లు ఇవ్వాలని ఉత్తర్వులు
- మార్కెట్ విలువకు నాలుగు రెట్లు జారీ
- రంగంలోకి దిగిన సీబీసీఐడీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీకి చెందిన మాజీ మంత్రి అండదండలు, ఆశీస్సులతో తణుకు మునిసిపాలిటీ 21 ఎకరాల్లో టీడీఆర్ బాండ్‌లు జారీ చేసింది. గజాల్లో లెక్క కట్టింది. అంటే 1.10 లక్షల గజాలకు బాండ్‌లు ఇచ్చింది. అంతకు నాలుగు రెట్లు విలువైన బాండ్‌లు మంజూరు చేసింది. గజం స్థలం విలువను పెంచేశారు. సుమారు రూ.7వేలు ఉన్న గజం స్థలాన్ని రూ.21వేలుగా నిర్ణయించారు. దానికి నాలుగు రెట్లు అంటే రూ. 84 వేలు విలువ చేసే బాండ్‌లు జారీ చేశారు. ఒక్కో గజానికి రూ. 84వేలు లబ్ధిపొందారు. ఇలా తణుకులో రూ.900 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌ల కుంభకోణానికి వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు చక్రం తిప్పారు. తణుకులో వైసీపీ నేత మొదలుకొని, రాష్ట్ర స్థాయి నేతలు కీలకంగా వ్యవహరించారు. కంపోస్ట్ యార్డు విస్తరణ, గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి కోసమంటూ స్థలాన్ని మునిసిపాలిటీ సేకరించింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోలేదు. కంపోస్ట్ యార్డు పక్కన వ్యవసాయ భూమి విలువ రూ.కోటి కూడా లేదు. అయినా బాండ్‌ల రూపంలో ఎకరం విలువ దాదాపు రూ.40 కోట్లకు పెంచారు. అంత మొత్తంలో భూ యజమానులకు లబ్ధి చేకూర్చారు.

ముందస్తు ప్రణాళిక

కంపోస్ట్ యార్డు, గ్రీన్‌ఫీల్డ్ భూముల విషయంలో వైసీపీ నేతలు ముందస్తు ప్రణాళిక చేసుకున్నారు. కంపోస్ట్ యార్డుకు అనుకుని 9 ఎకరాల భూమిని రైతుల నుంచి ముందుగానే కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. అయినా ఒప్పందం కుదుర్చుకున్న వారి పేరుతోనే అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారుల పేరుమీద బాండ్‌లు జారీ చేశారు. తణుకు టీడీఆర్ బాండ్ల కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాడేపల్లి గూడెంలోనూ అదే దందా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ బాండ్‌ల మంజూరుపై నిషేధం విధించింది. కొత్త మార్గదర్శకా లను విడుదల చేస్తామని స్పష్టం చేసింది. తణుకులో ముందస్తు ప్రణాళికతో జారీ చేసిన బాండ్‌లను తిరగదోడింది. మునిసిపాలిటీ సేకరించిన 21 ఎకరాలకు వ్యవసాయ భూముల ఆధారంగా బాండ్‌ల జారీకి ఆదేశాలిచ్చింది.

వైసీపీ నేతకు చెంపపెట్టు

బాండ్‌ల జారీలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ నేతకు కూటమి ప్రభుత్వ నిర్ణయం చెంపపెట్టు అయ్యింది. దాదాపు రూ.900 కోట్ల విలువైన బాండ్‌లు ఇప్పుడు రూ.90 కోట్లకు పడిపోనున్నాయి. స్థల యజమానులు అంగీకరించకపోతే ప్రభుత్వాన్ని ఆశ్రయించవచ్చు. లేదంటే న్యాయస్థానంలో పోరాటం చేసుకోవచ్చు. యజమానులు అంగీకరిస్తేనే కొత్త బాండ్‌ల జారీ ప్రక్రియ కొలిక్కి వచ్చినట్టవుతుంది. ముందుగా బాండ్‌లు జారీ చేస్తారు. యజమానుల నుంచి సానుకూలత లేకపోతేనే మునిసిపాలిటీ సేకరించిన 21 ఎకరాల భూమి సమస్య మళ్లీ మొదటికొస్తుంది. కానీ రూ.900 కోట్ల బాండ్‌లు జారీ మాత్రం రద్దయినట్టే లెక్క. దీనివల్ల వైసీపీ నేత చిక్కుల్లో పడే అవకాశం ఉంది. ఆయన ఆశీస్సులతో బాండ్‌లు మంజూరు చేసిన మునిసిపల్ అధికారులు సస్పెండ్ అయ్యారు. బాండ్‌లు కొనుగోలు చేసిన వారంతా నష్టపోయారు. వైసీపీ నేత లబ్ధి పొందారు. ఇప్పుడు ఆ సొమ్మును తిరిగి ఇస్తారా... లేదా యజమానుల శాపనార్థాలను ఎదుర్కొంటారా వేచి చూడాలి.

వివరాల సేకరణలో సీబీసీఐడీ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీబీసీఐడీ రంగంలోకి దిగింది. తణుకు మునిసిపాలిటీ నుంచి బాండ్‌ల వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఒకేసారి అన్ని కోణాల్లో దర్యాప్తుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. తణుకు, తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్‌ల మంజూరుపై మున్సిపల్ పరిపాలన శాఖ సమగ్ర నివేదికను కోరింది. ఇప్పటికే మునిసిపాలిటీలు వివరాలను సమర్పించాయి.



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆనం, కొలుసు

దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- శోభనాచల స్వామి దయతోనే ఎన్నికల్లో గెలిచా : మంత్రి కొలుసు
- ఆగిరిపల్లిలో ఘాట్ రోడ్డుకు శంకుస్థాపన

ఆగిరిపల్లి, అక్టోబరు 3 : రాష్ట్రంలో దేవాలయాల పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆగిరిపల్లిలోని శోభనాచల కొండపై ఉన్న శోభనాచల వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి ఆలయానికి రూ.2కోట్ల వ్యయంతో 2.కి.మీ మేర నిర్మించనున్న ఘాట్‌రోడ్డు నిర్మాణానికి గురువారం మంత్రి రామనారాయణరెడ్డి, నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాటాడుతూ.. 'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దేవాలయాల పరిరక్షణకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటోంది. త్వరలో ఆలయాల కమిటీలు నియమించడానికి చర్యలు తీసుకుంటున్నాం. నూజివీడు నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునర్‌నిర్మాణానికి ఆయా ప్రాంతాల ఆదాయ వనరులను బట్టి స్థానిక భాగస్వాములతో రూ.10 లక్షల నిధులు కేటాయిస్తాం. వచ్చే ఐదేళ్లలో ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది' అన్నారు. రామనాగలక్ష్మి నారాయణరావు, గోపాల్ కుటుంబ సభ్యులు నిర్మించిన శోభనా చలవ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ నూజివీడు నియోజక వర్గాన్ని రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలు సుదీర్ఘ కాలం నుంచి ఈ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ఎదురు చూస్తున్నారని, వారి కోరికను తీర్చే అవకాశం నాకు కలగడం నా అదృష్టంగా భావిస్తున్నారన్నారు. నూజివీడులో క్రీడా రంగాన్ని అభివృద్ధి పర్చడానికి స్టేడియం నిర్మాణానికి మంత్రి రామనారాయణరెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత మంత్రులకు, కలెక్టర్‌కు వేదపండితులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. దేవదాయ శాఖ ఉప కమిషనర్ బి.ఎల్ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి సీహెచ్ రంగారావు, దేవస్థానం ఈవో డి.సురేష్‌బాబు, నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, గ్రామసర్పంచ్ లక్ష్మి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

భీమడోలు, అక్టోబరు 3 : రానున్న రోజుల్లో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, టీడీపీ ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గన్ని క్యాంపు కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అక్టోబరు 2021 నాటికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని, నవంబరు 6 వరకూ అవకాశం ఉందన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదుకు ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు పాస్‌పోర్టు ఫొటో, ఫారమ్ 18 పూర్తి చేసి మండల పరిషత్ లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. గన్ని మాట్లాడుతూ 2024 - 26 సంవత్సరాలకు సంబంధించిన పార్టీ సభ్యత్వ నమోదుకు క్లస్టర్, యూనిట్, బూత్ డివిజనల్ అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ రుసుం రూ.100 పోను ఐదు లక్షల బీమా వర్తిస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



ఏలూరులో మద్యం డిపోను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

దరఖాస్తుల ప్రక్రియ పరిశీలించిన ఎక్సైజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి

ఏలూరు క్రైం, అక్టోబరు 3 : జిల్లాలో నూతన ఎక్సైజ్ పాలసీ విధానంలో మద్యం షాపులు ఏర్పాటుకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ఏలూరులో ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా మద్యం షాపులు ఏర్పాటుకు ఎన్ని దరఖాస్తులు అందాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మద్యం డిపోను పరిశీలించారు. ఆయన వెంట జేసీ ధాత్రిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభు కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, ఐసీ ధనరాజ్, ప్రభృతులు పల్గొన్నారు.

34 దరఖాస్తులు : మద్యం దుకాణాల ఏర్పాటుకు లైసెన్సు మంజూరు చేసే నిమిత్తం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ గడువు ఇచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 2న కైకలూరు మండలానికి రెండు దరఖాస్తులు వచ్చాయి. మూడో తేదీన జిల్లా వ్యాప్తంగా 32 దరఖాస్తులు వచ్చాయి. చింతలపూడి 16, నూజివీడు ఆఫ్‌లైన్‌లో 6, ఆన్‌లైన్‌లో 2, ఏలూరు 1, కైకలూరు 7 దరఖాస్తులు వచ్చాయి.

నిధులు లేక.. పడకేసిన ట్రైకార్



కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం

- సంస్థ నిధులు ఇతర పథకాలకు మళ్లింపు.. ఖజానా ఖాళీ
- కూటమి ప్రభుత్వంలో పూర్వవైభవం వస్తుందని గిరిజనుల ఎదురుచూపులు

బుట్టాయగూడెం, అక్టోబరు 3 : ఆదివాసీ గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేయబడిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల ఆర్థిక సహాయ సహకార సంస్థ (ట్రైకార్) నిధులు లేక పడకేసింది. గతంలో ఒక వెలుగు వెలిగిన ట్రైకార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం అయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఈ మేరకు ఛైర్మన్‌గా జిల్లాకు చెందిన బొరగం శ్రీనివాస్‌ను నియమించడంతో సంస్థకు మరల పునర్వైభవం వస్తుందని గిరిజనులు భావిస్తున్నారు.

వైసీపీ సర్కార్‌లో పూర్తిగా నిర్వీర్యం

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే సంస్థల్లో ట్రైకార్‌ను ప్రధానమైనదిగా చెప్పుకోవచ్చు. గిరిజనులకు అధికంగా ట్రైకార్ నుంచే ప్రయోజనాలు అందేవి. గిరిజన సంక్షేమ శాఖలో ఉండే పలు శాఖలు తమ తమ పరిధికి లోబడి పనిచేస్తే ట్రైకార్ మాత్రం అన్నిశాఖల సమన్వయంతో గిరిజనాభివృద్ధికి పనిచేసేది. ట్రైకార్‌కు కేంద్రం నుంచి కూడా నిధులు రావడంతో గిరిజనాభివృద్ధిలో తనకంటూ ముద్ర వేసుకుంది. ఏటా కోట్లాది రూపాయల విలువ గల రుణాలను ఆదివాసీలకు సబ్సిడీపై అందిస్తూ వచ్చేది. అయితే ట్రైకార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా కనుమరుగైంది. ట్రైకార్‌కు వచ్చే నిధులకు వేరే పథకాలను మళ్లించడంతో పూర్తిగా పడకేసిందని గిరిజనుల నుంచి ఆరోపణలు లేకపోలేదు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ట్రైకార్ పేరుతో ఆదివాసీ గిరిజనులకు ఒక్క పథకం కూడా మంజూరు చేయలేదు.

పూర్వ వైభవానికి కృషి చేస్తా..



రాష్ట్ర వ్యాప్తంగా ట్రైకార్ పూర్వవైభవం తేవడానికి నా వంతు కృషి చేస్తా. గత ప్రభుత్వం హయాంలో ట్రైకార్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. సంస్థకు చెందిన నిధులను మళ్లించి వేరే పథకాలకు వాడారు. ప్రస్తుతం ట్రైకార్‌లో పైసా లేకుండా చేశారు. కనుమరుగైన ట్రైకార్‌ను ఆదివాసీలు కలకాలం గుర్తుంచుకునేలా తీర్చిదిద్దుతా.

- ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్

ఒకప్పుడు నిధులు పుష్కలం

గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లతో పాటుగానే గిరిజనుల సంక్షేమం కోసం 1975లోనే ట్రైకార్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో కోటరామచంద్రపురం ఐటీడీఏ ఆధ్వర్యంలోనే ట్రైకార్ తన కార్యాకలాపాలను నిర్వహిస్తుంది. గిరిజనులకు సబ్సిడీపై వ్యక్తిగత, గ్రూపు రుణాలను రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకుల ద్వారా ఇప్పించడం, ఏటా నైపుణ్యాభివృద్ధికి శిక్షణలు ఇవ్వడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగులు శిక్షణలు, ఇతర శాఖల సమన్వయంతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ట్రైకార్ చేస్తుంది. ఈ సంస్థకు నిధులు పుష్కలంగానే ఉండేవి. ఐటీడీఏ పరిధిలో పనులు ముందుకు సాగాలంటే అధికారులు ట్రైకార్ నిధులను వాడుకుని మరల జమ చేసేవారు. ఏటా ట్రైకార్ ద్వారా గిరిజనులకు రుణాలు, వేలాది మందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేవారు. అటువంటిది వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తిరోగమనంలో పయనించింది. కరోనా అనంతరం ట్రైకార్‌ను ఆదివాసీలు మర్చిపోయారు. ట్రైకార్‌కు పూర్వవైభవం తెచ్చి గిరిజనుల అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.



రోడ్లపై గోతులు పూడ్చాలంటూ..

చింతలపూడి మండలం రేచర్ల వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై భారీ గోతులు ఉన్నాయని తక్షణం మరమ్మతులు చేపట్టాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిపారు. రోడ్లు వేయండి- ప్రయాణికుల ప్రాణాలు కాపాడండి అంటూ గోతుల్లో నిలిచిన నీటిలో నిలబడి నినాదాలు చేశారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు ఘటనా స్థలానికి వచ్చి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు. మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సీపీఐ నాయకులు టి.బాబు, రామచంద్రారెడ్డి, కృష్ణ, సుబ్బారావు, గ్రామా నికి చెందిన పలువురు నాయకులు పాల్గొని నినాదాలు చేశారు.

నరక దారులు!

- చింతలపూడి చుట్టూ రోడ్లన్నీ గోతులమయం
- తరచూ వాహనదారులు ప్రమాదాల పాలు
- కనీసం మరమ్మతులైనా చేపట్టాలంటూ విజ్ఞప్తి



చింతలపూడి-టి.నర్సాపురం రోడ్డు దుస్థితి



రేచర్ల వద్ద రోడ్డు ఇలా..

చింతలపూడి, అక్టోబరు 3 : చింతలపూడి చుట్టూరా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్లన్నీ గోతులు, గతుకుల మయంగా అధ్వానంగా మారి ప్రాణాంతక రహదారుల్లా మారాయి. ప్రధానంగా చింతలపూడి నుంచి సీతానగరం వెళ్లే దారిలో రేచర్ల వద్ద ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలన్నా ప్రమాదకరంగా ఉన్నాయి. రాఘవాపురం మార్గంలో, ఏలూరు మార్గంలో వెలగలపల్లి వరకు, కామవరపుకోట మార్గంలో, జంగారెడ్డిగూడెం వెళ్లే టి.నర్సాపురం రోడ్డులో, మండలపల్లి వెళ్లే అల్లిపల్లి రోడ్డు వరకు, జీలుగుమిల్లి వెళ్లే మక్కినవారిగూడెం రోడ్లను కొత్తగా నిర్మాణం చేయాలి. గత నాలుగేళ్లుగా ఇదే సమస్య. వర్షాలు తగ్గుముఖం పట్టినా స్థానిక అధికారులు చిన్నచిన్న మరమ్మతులు సైతం చేయడం లేదు. ఇదేమంటే గ్యాంగ్‌మెన్ లేరు, నిధులు లేవు, కాంట్రాక్టర్లు రావడం లేదంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకో వాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస మరమ్మతులు చేయడం లేదు



చింతలపూడి పరిసరాల్లో రోడ్లన్నీ భారీ గోతులతో దర్శనమిస్తున్నాయి. కనీస మరమ్మతులు చేయ డం లేదు. ప్రాణాలు పోయాక పరిహారం ప్రకటిస్తారా..?


- ఇస్లావతు అశోక్‌కుమార్, చింతలపూడి

ఇంకా ఎన్నాళ్లిలా..?



చింతలపూడి మండలంలో అన్ని రోడ్లు భారీ గోతులతో దారుణంగా ఉన్నాయి. ఇంకా ఈ గోతులు ఎన్నాళ్ళు.? కొత్తరోడ్లు తక్షణం వేయాలి.

వై.వి.సత్యనారాయణ, ఎర్రగుంటపల్లి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, టీడీపీ నాయకులు

సీఎం సహాయ నిధికి రూ.51 లక్షల విరాళం

చింతలపూడి/జంగారెడ్డిగూడెం, అక్టోబరు 3: చింతలపూడి నియోజక వర్గంలో వివిధ దాతలు అందించిన వరద బాధితుల నిధులు 51 లక్షల 56 వేల 240 రూపాయల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు తదితర అభివృద్ధి పనులపై 200 కోట్లు ఖర్చు అయ్యే ప్రతిపాదనలను సీఎంకు అంద జేశామన్నారు. రిజర్వుడు నియోజకవర్గంలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయని, వీటిని పరిష్కరించకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని ఆయన దృష్టికి తీసుకొచ్చినట్టు చెప్పారు. ఇందులో చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, లింగపాలెం మండలాలకు చెందిన సమస్యలను ప్రస్తావించినట్టు తెలిపారు. ఆయనతో పాటు నాలుగు మండలాల నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, జగ్గవరపు ముత్తా రెడ్డి, మండవ లక్ష్మణరావు, గరిమెళ్ళ చలపతి రావు, మాటూరి వెంకట్రామయ్య, రావూరి కృష్ణ, కిలారు సత్యనారాయణ, పక్కాల వెంక టేశ్వర రావు, సాయల సత్యనారాయణ, గుత్తా ప్రసాద్, కె.రాజశేఖర్‌రెడ్డి, కె.శేషగిరిరావు, ఆట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి



జంగారెడ్డిగూడెంలో వాసవీమాత, ఉంగుటూరులో చల్లాలమ్మ, గుండుగొలనులో భ్రమరాంబ, బుట్టాయగూడెం, పోలవరంలో అమ్మవార్లు



ఫత్తేపురంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

దసరా సందడి

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో పూజలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 3: శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా దసరా సందడి నెలకొంది. ఆలయాల్లో గురువారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఏలూరు నగరంలో పలు ఆలయాల్లో అమ్మవారిని ఎమ్మెల్యే బడేటి చంటి దర్శించారు. అమ్మవారి దయ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. రేవులింగేశ్వరస్వామి, నల్లదిబ్బలోని అమ్మవారు, పాతబస్టాండ్, ఆటోస్టాండ్ అమ్మవారి ఆలయాల్లో చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అమరావతి అశోక్, ఆర్నేపల్లి తిరుపతి, బొద్దాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌పేట వాసవి ఆలయంలో మహాత్రిపుర సుందరి, రాజ్యలక్ష్మి, రాజ్యశ్యామలా అమ్మవార్లకు మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణపు వీధి శ్రీజాల బహరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మంచిసేవలు అందించాలని దుర్గాదేవి అమ్మవారికి ప్రార్థించినట్లు మేయర్ తెలిపారు.

● ఏలూరు కార్పొరేషన్: నగరంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాలన్నీ భక్తులతో, సందర్శకులతో కిటకిటలాడాయి. సత్రంపాడు అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మి, దక్షిణపువీధిలో బాలా త్రిపుర సుందరి, మహిషాసుర మర్దిని, అగ్రహారంలో రాజ్యలక్ష్మీదేవి, కన్యకాపరమేశ్వరి, జ్ఞాన సరస్వతిదేవి, పవరుపేట కాశీ అన్నపూర్ణాదేవి, బావిశెట్టివారిపేట, పత్తేబాద, పన్నెండు పంపుల సెంటర్ తదితర ప్రాంతాల్లో గల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలు దేవీ నవరాత్రుల పూజలతో హోరెత్తాయి.

● కామవరపుకోట: మండలంలో దేవీ నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారెలు సమర్పించారు. పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సుదర్శనం వెంకట సత్యశ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలుచేయించారు. అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఆడమిల్లి, తడికలపూడి, కళ్ళచెరువు, జీలకర్రగూడెం, గుంటుపల్లి, రామన్నపాలెం, రావికంపాడు తదితర గ్రామాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నెలకొల్పి పూజలు చేశారు.

● దెందులూరు: మండలంలోని పెరుగుగూడెం గ్రామ దేవత పాటిమ్మ తల్లికి దేవస్థానం చైర్మన్ యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రులు సందర్భంగా అమ్మవారికి 108 పుట్టింటి చీరలు, బోనాలను సమర్పించారు. గ్రామాల్లో ప్రజలందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని కోరారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

● భీమడోలు: గుండుగొలను, పూళ్ళ, భీమడోలు తదితర గ్రామాల్లో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గుండుగొలనులో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయాల్లో తొలిరోజు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో పాటు లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారిని వెండి చీర అలంకరించి పూజలు చేశారు. ఈతకోట వారి వీధిలో దసరా ఉత్సవాల్లో గన్ని వీరాంజనేయులు పాల్గొని పూజలు చేశారు.

● ఉంగుటూరు: దసరా ఉత్సవాలలో భాగంగా వివిధ గ్రామాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉంగుటూరు చల్లాలమ్మ తొలిరోజు శైలపుత్రిగా దర్శనమిచ్చారు. అర్చకులు వెంపరాల జోగిశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. రెడ్డి సూర్యచంద్రరావు బృందం భవాని మాల ధరించి చండీ హోమం నిర్వహించారు.

● నిడమర్రు: దేవీ శరనవరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవీ అవతారంలో దర్శనమిచ్చారు. ఫత్తేపురం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, దుర్గాదేవి ఆలయాలలో అమ్మవార్లను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకున్నారు. పెదనిండ్రకొలను, నిడమర్రు, భువనపల్లి, అడవికొలను గ్రామాలలో ఆలయాలను సందర్శించచారు. రుద్రరాజు కొండయ్య, చింతలపాటి బాసిరాజు, వంగా రఘు తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వేలేరుపాడు సంతమార్కెట్ సెంటర్‌లో అమ్మవారిని ప్రతిష్ఠించి విశేషపూజలు నిర్వహించారు. బాలత్రిపుర సుందరీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. 9రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తొలి రోజునే భక్తులు పెద్దఎత్తున అమ్మవారని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● బుట్టాయగూడెం: స్థానిక త్రిశక్తి పీఠంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులు అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

● జీలుగుమిల్లి: దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జగదాంబ దేవీ నవరాత్రి ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గజమాలతో అలంకరించారు. గడ్డమణుగు రవి కుమార్, చాట్రాతి ప్రసాద్, సుంకవల్లి సాయి, కొండపల్లి వెంకట దుర్గాప్రసాద్, చిర్రి శ్రీను, కోరుకొండ రామకృష్ణ, వేగేశ్న రాధకృష్ణ, గద్దె సుబ్రమణ్యం, కోలా ధర్మరాజు, అంజూరి సత్యనారాయణ, కొత్తపల్లి శ్రీను, బొలగాని అఖిల్ ఉన్నారు.

● పోలవరం: మండలంలో కనకదుర్గ ఆలయాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. బస్ షెల్టర్ వద్ద ఉన్న కనకదుర్గ ఆలయం, గోదావరి నదీ తీరాన వాసవీ కన్యకా పరమేశ్వరీ సమేత నగరేశ్వరస్వామి ఆలయం, బంగారమ్మపేట కనకదుర్గ ఆలయం, కొత్తపట్టిసీమ, గూటాల, ఎల్లండిపేట, వింజరం గ్రామాల్లో కనకదుర్గ ఆలయాల్లో అమ్మవార్లకు నదీ జలాలతో కలశాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ, పుష్ప అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో గంగానమ్మ ఆలయం వద్ద శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. 200 మందికి పైగా మహిళా భక్తులు కలశాలు, మేళతాళాలతో పల్లకి సేవలో ఊరేగించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శన మిచ్చారు. పరిమి సత్తిపండు అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాలమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ రాజాన పండు, రామలక్ష్మి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారు నూకాంబికా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, దారా రవీంద్ర, దారా చక్రవర్తి, కర్పూరం నారాయణరావు, మహంకాళి రామ్మోహనరావు, మాతు రాజా తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: మండలంలో శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. రాట్నాలకుంట రాట్నాలమ్మవారు తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రామసత్యనారాయణశర్మ, మోహన దుర్గా శేష గిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారి లలితా సహస్రనామ అష్టోత్తర సహిత దేవీ ఖడ్గమాలార్చనతో తొలిపూజ నిర్వహించారు.

● ద్వారకాతిరుమల: శేషాచలంపై కొలువుదీరిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకించారు. జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను అధికారులు ప్రారంభించారు. పలువురు భక్తులు భవానీ, కుంకుళ్లమ్మ దీక్షాధారణ చేపట్టారు. ఏటా దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పలుప్రాంతాల వారు అమ్మవారి దీక్షను చేపట్టడం సంప్రదాయం. శరన్నవరాత్రుల ముగింపురోజున చండీహోమం అనంతరం దీక్షను విరమిస్తారు.

● లింగపాలెం: మండలంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. బాలాత్రిపురసుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రంగాపురం భూనీలా సహిత సీతారామాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండలంలో పలు చోట్ల అమ్మవారి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన ఆలయాలు, గ్రామాల్లోని పలు సెంటర్లలో అమ్మవారి ఉత్సవాలు ఆరంభించారు. మొదటి రోజు బాలత్రిపుర సుందరి అలంకరణలో అమ్మ వారిని భక్తులు కొలిచారు.



పెరుగుగూడెం పాటిమ్మ తల్లికి 108 పుట్టింటి చీరలు అందించిన ఆలయ చైర్మన్ శ్రీనివాస్ దంపతులు









నవదుర్గల వేషధారణలో విద్యార్థుల రాక్షస సంహారం ప్రదర్శన

పాఠశాలల్లో దసరా వేడుకలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 3: నగరంలోని పలు పాఠశాలల్లో గురువారం దసరా వేడుకలు నిర్వహించారు. ఆర్ఆర్ పేటలోని శ్రీ శర్వాణి స్కూలులో గురువారం అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేశారు. బొమ్మల కొలువు ఏర్పాటుచేసారు. విద్యార్థులు నవదుర్గల వేషధారణలో రాక్షస సంహారం నృత్యప్రదర్శనతో అలరించారు. బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శ్రీరామ్‌నగర్ శ్రీశ్రీ పాఠశాల విద్యార్థులు నవదుర్గాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. కనకదుర్గ, మహిషాసురమర్దినిగా, మహంకాళిగా, అనేక శక్తిరూపాలుగా దర్శనమిస్తూ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు.



వసంత మహల్ సెంటర్ వద్ద దీక్షలో వివిధ పార్టీల నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దంటూ నిరసన దీక్ష

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 3: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగని వసంతమహల్ సెంటర్‌లోని అమరజీవిపొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష నిర్వహించారు. దీక్షలో రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, చేతివృత్తిదారుల సంఘాల ప్రతినిధులు నిరసన దీక్ష చేపట్టారు. కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్, రాజనాల రామ్మోహన్‌రావు, బండి వెంకటేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, రెడ్డి శ్రీనివాస డాంగే, ఆర్.లింగరాజు, డీఎస్‌వీడీ.ప్రసాద్, బద్దా వెంకట్రావు, కట్టా భాస్కరరావు, బి.సోమయ్య, నిమ్మగడ్డ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది వేతనాలు విడుదల చేయాలి



వేతనాలు విడుదల చేయాలని కార్మికుల నినాదాలు

బుట్టాయగూడెం, అక్టోబరు 3: పారిశుధ్య సిబ్బంది వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సిబ్బంది బుట్టాయగూడెం సీహెచ్‌సీ వద్ద గురువారం ఆందోళన చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సిబ్బందితో వెట్టి చాకిరి చేయిస్తూ నెలవారీ వేతనాలు జమ చేయకపోవడం బాధకరమన్నారు. 6 నెలలుగా వేతనాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర సేవల్లో భాగమైన పారిశుధ్య కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారం దారయ్య, జేవీ రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 3: ప్రజా సమ్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం నేత కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని కోరారు. కట్టా సత్యనారాయణ, వి.జి.ఎం.ఆర్.కృష్ణారావు, వి.శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై ఆర్డీవో సమీక్ష



ధాన్యం సేకరణపై సమీక్షిస్తున్న ఆర్డీవో

ఉంగుటూరు, అక్టోబరు 3: ధాన్యం సేకరణపై మండల స్థాయి అధికారులతో ఆర్డీవో అంబరీష్ గురువారం సమీక్షించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు ధాన్యం సేకరణపై సూచనలు ఇచ్చారు. రైతులకు గోనె సంచుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఏవో ప్రవీణ్‌కుమార్, సివిల్ సప్లైస్ డీటీ స్వర్ణదుర్గ, పాల్గొన్నారు.

రేపు కేవీఎస్ సాహిత్య ప్రతిభా పురస్కారం ప్రదానం

ఏలూరు రూరల్, అక్టోబర్ 3: సాహిత్య మండలి ప్రాంగణంలో ఈనెల 5న కేవీఎస్ సాహిత్య ప్రతిభా పురస్కార సభ నిర్వహిస్తున్నట్లు పుల్లాబొట్ల పురుషోత్తమరావు గురువారం తెలిపారు. దూళిపాళ సహదేవమణి, తాతా సందీప్‌శర్మకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.



బయ్యన్నగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, అధికారులు



తాడిచర్లలో వరి చేను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం, అక్టోబరు 3: రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో చెన్నకేశవులు అన్నారు. బయ్యన్నగూడెం, యర్రంపేట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో సబ్సిడీ పథకాలు అందిస్తుందన్నారు. ఐదెకరాల లోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందిస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో పొలంపిలస్తుంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● కామవరపుకోట: రైతులు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఆదాయం పొందవచ్చని ఏవో సి.పవన్‌కుమార్ అన్నారు. తాడిచర్ల, సాగిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి రాయితీలను వివరించారు. ఉద్యాన శాఖాధికారి జి.లక్ష్మతి, పశు సంవర్ధక శాఖ, సిబ్బంది పాల్గొన్నారు. తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు, రైతులు సాగిపాడు సర్పంచ్ గుండుగొలను సుబ్బారావు, ఆయా గ్రామాల రైతులు హాజరయ్యారు.

● పెదపాడు: సత్యవోలు, సకలకొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. జిల్లా మత్స్యశాఖాధికారి నాగలింగాచారి రైతులకు సూచనలు ఇచ్చారు. వరిలో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్దతులను ఏవో ప్రవీణ్‌కుమార్ తెలియజేశారు. ఎంపీటీసీ రంభా నాగరాజు, సర్పంచ్ ఉమామహేశ్వరి, లావేటి హేమ సుందర్‌బాబు, పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 3: కొంతకాలంగా స్థిరంగా ఉన్న కూరగాయల ధరలు పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుబజార్లలో కిలో టమోటా రూ.74, వంకాయలు రూ.34, బెండ రూ.34, మిర్చి రూ.28, కాకర రూ.34, బీర రూ.54, క్యాబేజి రూ.28, క్యారెట్ రూ.54, దొండ రూ.48, బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.40, గోరుచిక్కుడు రూ.44, చిక్కుడు రూ.100, దోస రూ.30, బీట్‌రూట్ రూ.46, కీర దోస రూ.40, బీన్స్ రూ.108, అల్లం రూ.150, క్యాప్సికం రూ.70, ఆకాకర రూ.140, ఆనప ఒక్కింటికి రూ.40, అరటి ఒక్కటికి రూ.10, పాలకూర, చుక్కకూర, మెంతుకూర, తోటకూర కట్ట రూ.10 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు.

5,6 తేదీలలో బస్ పాస్‌ల జారీ ఉండదు

ఏలూరు క్రైం, అక్టోబరు 3: ఏలూరు ఆర్టీసీ డిపోలో ప్రతి నెలా జారీ చేసే సీజన్ పాస్‌లు, స్టూడెంట్ బస్ పాస్‌లను ఈ నెల 5,6 తేదీలలో జారీ ఉండదని ఆర్టీసీ డిపో మేనేజర్ బి వాణి గురువారం తెలిపారు. బస్‌పాస్‌లు జారీలో సాఫ్ట్‌వేర్ మార్పుల కారణంగా రెండు రోజులు బస్‌పాస్‌ల జారీ ఉండదని స్పష్టం చేశారు. తిరిగి 7 నుంచి యధావిధిగా బస్‌పాస్‌లు, నెలవారీ సీజన్ పాస్‌లు అందించబడతాయని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

వేలేరుపాడు, అక్టోబరు 3: మండలంలోని కన్నాయిగుట్టలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. కన్నాయిగుట్ట గ్రామానికి చెందిన కుంజా ముత్యాలు, కుటుంబ సభ్యులు గురువారం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఇంట్లో సామగ్రి అగ్నికి ఆహుతైంది. వీఆర్వో చీమల వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు ఆదినారాయణ, క్రాంతికుమార్ బాధితులను పరామర్శించారు.

శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలు

లింగపాలెం, సెప్టెంబరు 3: కొణిజర్ల గ్రామానికి చెందిన బాలుడు మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పొదిల రమేష్‌కు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తరుఫున రూ.10 వేలు, జడ్పీ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, గంటా ప్రసాద్ దంపతులు రూ.5వేలను అందజేశారు. జి.మోహన్, జి.ప్రకాశరావు, డీకేఎస్ఎస్.ప్రకాశరావు, మల్లీశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 3: జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనుబాబు మాట్లాడుతూ ఎస్సైలుగా ఎస్ఎన్ఎస్.సుబ్రహ్మణ్యం, జి.వెంకటలక్ష్మి ఇక్కడ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. పట్టణంలో 7, రూరల్‌లో 4, కుక్కునూరు మండలంలో 2, వేలేరుపాడు మండలంలో 1, జీలుగుమిల్లి మండలంలో 2 మద్యం దుకాణాల లైసెన్స్ జారీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు

చింతలపూడి, అక్టోబరు 3 : స్థానిక ఏరియా ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టును గురువారం ప్రారంభించారు. పోలీస్ అవుట్‌పోస్టు అవసరమని ఇటీవల ఏరియా ఆసుపత్రి సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచనతో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. మెడికో లీగల్ కేసుల్లో జాప్యం నివారించవచ్చన్నారు. ఎమర్జెన్సీ కేసులు, పోస్టుమార్టం కేసులు సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల నుంచి ఎక్కువగా వస్తుంటాయి. త్వరితగతిన చర్యలు చేపట్టేందుకు వీలు కలుగుతుందని అభివృద్ధి కమిటీ సభ్యులు కోండ్రు దేవ, జి.భారతి అన్నారు.

ఆశ వర్కర్ తొలగింపుపై నిరసన

భీమడోలు, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, అక్టోబరు 3 : టి.నర్సాపురం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్త లక్ష్మీ మంగను తొలగించడంపై గురువారం పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భీమడోలు, పూళ్ళ పీహెచ్‌సీల వద్ద ఆశ కార్యకర్తలు ఆందోళ నిర్వహించారు. యూనియన్ నేతలు పద్మ, ఉదయ మణి, ఆశ కార్యకర్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండలం నందాపురం, దొరమామిడి, అంతర్వేది గూడెం, పులిరాముడు గూడెం, కేఆర్.పురం పీహెచ్‌సీల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి, మంగ తాయారు, పోసమ్మ, శాంతకుమారి, గంగాదేవి, జేబి, లక్ష్మీ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వద్ద అందోళనలో ఎస్. రాంబాబు ఆశావర్కర్లు పాల్గొన్నారు. కుక్కునూరు, అమరవరం పీహెచ్‌సీల వద్ద సాయికిరణ్, నాగేంద్రరావు, కారం రాజేశ్వరి, బాపనమ్మ, తులసి పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే జోక్యంతో ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోనున్నట్లు ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం..

- ఏలూరు టూటౌన్ : నియోజకవర్గ ప్రజలందరికి తాగునీరు అందించటమే లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సత్యనారాయణపేటలో డీప్‌బోర్‌కు శంకుస్థాపన చేశారు. తాగునీటి సమస్యలు ఎక్కడున్నా తమ దృష్టికి తేవాలన్నారు.
- విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధికి కాలి నడకన వెళ్ళే భక్తుల సౌకర్యార్థం అల్పాహారాన్ని అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చంటి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు రామకృష్ణపురంలో అల్పాహారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నగర కమిషనర్ భానుప్రతాప్, పీవో కృష్ణమూర్తి, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి పాల్గొన్నారు.
- ఏలూరు అర్బన్ : సీఆర్ఆర్ బీఈడీ శిక్షణ కళాశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ హిమబిందు, గోసాల ఝాన్సీరాణి, లెక్చరర్లు నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- ఏలూరు రూరల్ : అర్బన్, తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 4న నిర్వహించవలసిన ప్రజాదర్బార్ ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు అర్బన్ తహశీల్దార్ జి.వి శేషగిరి తెలిపారు.
- పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా నారాశేషు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనివాస వైభవ ఉత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు, ఆరాధనలు నిర్వహించారు.
- పెదపాడు : ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దారు కార్యాలయాల నుంచి బదిలీపై వెళుతున్న ఎంపీడీవో తేజరతన్, పలువురు కార్యదర్శులు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందిని సత్కరించారు. డీటీ సునీత, ఏవో రవికుమార్ పాల్గొన్నారు.
- కామవరపుకోట : ఎంపీడీవో కె.శ్రీదేవి, ఈవోపీఆర్డీ జి.మరిడయ్య బదిలీ కావడంతో వారిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తహసీల్దార్ గెద్దం ఎలీషా, ఏవో పవన్‌కుమార్, జి.వి.సత్యనారాయణ, వి.రాజేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎస్.కె.కాజావలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.
- భీమడోలు : వెలమపేటలో క్యాన్సర్ వ్యాధితో మరణించిన గండి కృష్ణ కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బియ్యం, నిత్యావసర సరుకులు కొత్త దుస్తులు అందజేశారు. సూరప్పగూడెంలో ప్రమాదవ శాత్తు కాలువిరిగిన నిరుపేద వ్యక్తి రాముడు మందులు నిమిత్తం ఐదు వేల రూపాయల నగదు అందజేశారు. వెజ్జు కొండలరావు, పంచగర్ల సత్యనారాయణ, అల్లాడ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు : ఇన్‌చార్జి తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్ గురువారం రిలీవ్ అయ్యారు. వీఆర్వోలు ఉంగుటూరు మండల కలింగ సేవా సంఘం నాయకులు ఆయనను సత్కరించారు.
- పోలవరం : స్థానిక గణేశ్‌నగర్ కాలనీలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 2 వేల మంది పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు కమిటీ నిర్వాహకులు ఆకుల సత్యనారాయణ , చెరుకూరి వీరబాబు తదితరులు తెలిపారు.



7, 8 తేదీల్లో ఆగిరిపల్లిలో డీఆర్‌పీలకు శిక్షణ

ఏలూరు అర్బన్, అక్టోబరు 3 : పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ)లకు ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులకు విధులు, బాధ్యతలపై మండల స్థాయిలో శిక్షణ ఇచ్చే క్రమంలో తొలుత ఒక్కో జిల్లా నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన జిల్లా రిసోర్స్ పర్సన్లకు (డీఆర్‌పీ) రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 7, 8 తేదీల్లో రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించనున్నారు. శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు ఎంపిక చేసిన డీఆర్‌పీల బృందాలకు ఏలూరు జిల్లాలోని ఆగిరిపల్లి హీల్ ప్యారడైజ్ స్కూలులో శిక్షణ జరుగనుంది. ఒక్కో డీఆర్‌పీ బృందంలో ముగ్గురు టీచర్లు, ఇద్దరు ఎస్‌ఎంసీల చైర్‌పర్సన్లు ఉంటారు. రాష్ట్రస్థాయి శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత వీరంతా సంబంధిత జిల్లాల్లో మండల స్థాయిలో ఎస్‌ఎంసీ ప్రతినిధులకు శిక్షణ నివ్వాల్సి ఉంటుంది.ఏలూరు జిల్లాకు సంబంధించి మొత్తం 1842 ఎస్‌ఎంసీలు ఈ ఏడాది ఆగస్టులో ఏర్పాటైన సంగతి విదితమే. రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమానికి సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయ అధికారి లక్ష్మణ్, వెంకటరమణ వ్యవహరిస్తారు.



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

ప్రజా ప్రతినిధులకు పరిపాలనలో అవగాహన అవసరం

ఏలూరు రూరల్, అక్టోబరు 3: గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు పరిపాలనలో అవగాహన కలిగి ఉండాలని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం జిల్లా పంచాయతీరాజ్ వనరుల శిక్షణా కేంద్రంలో ట్రైనీలకు జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులకు, అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పంచాయతీలో పది అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో పరిపాలన, పంచాయతీ రాజ్ చట్టంలోని నిబంధనలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, లేఅవుట్లు, బిల్డింగ్ ప్లాన్‌ల నిబంధనలు, పంచాయతీ ఆస్తులు, న్యాయపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు,జడ్పీ శిక్షణ విభాగం కోఆర్డినేటర్ ప్రసంగిరాజు పాల్గొన్నారు.

7న రాజమండ్రి పీఎఫ్ కార్యాలయం వద్ద ఆందోళన

ఏలూరు రూరల్, అక్టోబరు 3: ఈపీఎఫ్‌ఎస్ 95 పింఛనర్లకు కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆర్‌పీఏ సెంట్రల్ కమిటీ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 7వ తేదీన రాజమండ్రి రీజనల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకమిటీ అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి కె.వి.కె మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కనీస పింఛన్ రూ.9 వేలతో పాటు డీఏ ఇవ్వాలని, అయ్యర్ పింఛన్ అమలు చేసి రైల్వేలో రాయితీలు పునరుదరించాలని భార్యాభర్తలు ఇద్దరికి వైద్య సదుపాయం కల్పించాలనే డిమాండ్‌లతో ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి పింఛనర్లు, రిటైర్ ఉద్యోగులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీ నిట్‌లో ఘనంగా ఐఈఈఈ దినోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 3 : వినూత్న ఆలోచనలతో వస్తే వాటిని నాణ్యమైన , ఆచరణాత్మకమైన ఆవిష్కరణలుగా తీర్చి దిద్దుకునేందుకు ఐఈఈఈ చక్కటి పరిష్కార వేదికగా నిలుస్తుందని ఆంధ్రా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు, ఐఈఈఈ వైజాగ్ బే సెక్షన్ వ్యవస్థాపక డైరక్టర్ డాక్టర్ సదాశివుని లక్ష్మీనారాయణ అన్నారు. ఏపీ నిట్‌లోని ఐఈఈఈ స్టూడెంట్స్ బ్రాంచ్, పవర్ ఎలక్ట్రానిక్స్ , ఇండస్ట్రీ అప్లికేషన్స్ , పవర్ అండ్ ఎనర్జీ విభాగాల ఆధ్వర్యంలో ఐ-ఈఈఈ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణ ఆన్లైన్ ద్వారా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఐ ఈఈఈ సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. దేశ వ్యాప్తంగా ఎంతో మంది అనుభవజ్ఞులైన ఆచార్యులు, నిపుణులైన ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఇందులో సభ్యులుగా ఉన్నారని, పరిశోధనల విషయంలో ఎదురయ్యే సమస్యలను వారితో నిరంతరం చర్చించి ఉత్తమమైన పరిశోధనలుగా మలుచుకోవచ్చునన్నారు. ఐఈఈఈ స్టూడెంట్స్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ శ్రీఫణికృష్ణ కర్రి, ఆదిత్య శ్రీరామ్, గుమ్మల బాబు, బలరామ్‌కుమార్, ఆచార్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఆశ వర్కర్ సమస్య పరిష్కారం



సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

టి.నరసాపురం, అక్టోబరు 3: టి.నరసాపురం పంచాయతీ పరిధిలో గండిగూడెం గ్రామ ఆశ వర్కర్ కాసగాని లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించి నందుకు నిరసనగా 8 రోజులుగా ఆశా వర్కర్లు యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఆశా వర్కర్ల రాష్ట్ర నాయకురాలు పోచమ్మ, సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్.లింగరాజు ధర్నా చేపట్టారు. గురువారం ధర్నా శిబిరాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీఎంహెచ్‌వో సందర్శించి వారితో మాట్లాడారు. ఆశా వర్కర్లు మాట్లాడుతూ నెలవారీ మీటింగ్ అని చెప్పి సంతకాలు తీసుకుని వాటి ఆధారంగా లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించారని కార్యదర్శి, ఏఎన్‌ఎంలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆమెను తొలగించ లేదని, ఫిర్యాదులు మాత్రం వచ్చాయని ఎమ్మెల్యేకు డీఎంహెచ్‌వో తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగ యధావిధిగా విధుల్లో కొనసాగుతుందని చెప్పారు. రేపటి నుంచి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్ పి.నాగబాబుపై విచారణకు ఆదేశించారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు, నాయుడు రామకృష్ణ, జయవరపు శ్రీరామమూర్తి, నల్లూరి చలపతిరావు, బొంతు సత్యనారాయణ, చాత్రాతి యుగంధర్, పాలేటి సత్యనారాయణ, కొరివి శేషు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు 4.5 కేజీల రజిత మకర తోరణం



భీమవరం టౌన్, అక్టోబరు 3 : ఆర్యవైశ్య సంఘ భవనంలో ఉన్న వాసవీ అమ్మవారికి దాతల సహకారంతో 4.5 కేజీల వెండితో 4 లక్షల 50 వేలు విలువ చేసే వెండి మకర తోరణం గురువారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. అర్చకులు సంప్రోక్షణ నిర్వహించి అమ్మవారికి అలంకారం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిడమర్రు-అడవికొలను రహదారికి మరమ్మతులు



నిడమర్రు అక్టోబరు 3 : నిడమర్రు - అడవికొలను రహదారికి మోక్షం లభించనుంది. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సుమారు 9 కి.మీ రహదారికి 90 లక్షల రూపాయలు నిధులు తీసుకువచ్చారు. కాంట్రాక్టు ఖరారయ్యేలోపు రోడ్డు మరమ్మతులు చేయమని ఎమ్మెల్యే సూచన మేరకు నిడమర్రు జనసేన నాయకులు చల్లంశెట్టి సూరిబాబు నేతృత్వంలో గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.5 లక్షలతో రోడ్డుకు తాత్కాలిక మర మ్మతుల చేపట్టారు. సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొ న్నారు. పదేళ్ల నిరీక్షణ అనంతరం గ్రామంలో ప్రధాన రహదారికి మోక్షం లభించి నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు



వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం
20 నెలలుగా అందని గౌరవవేతనం
కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

ఏలూరు రూరల్, అక్టోబరు 3 : అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసినట్లుగానే గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను భ్రష్టు పట్టించింది. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ఖజానాకు మళ్ళించుకుని పంచాయతీలను కుదేలు చేసింది. ప్రజలు ఎన్నుకున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను డమ్మీగా మార్చింది. ఇప్పటికే అధికారాలు, నిధులు లేని మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) సభ్యులకు కనీసం గౌరవవేతనం చెల్లించలేదు. వైసీపీ అధికారం నుంచి దిగిపోయే నాటికి వీరికి 20 నెలల గౌరవ వేతనం, బకాయిలు ఉన్నాయి. ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గాలు ఏర్పడి మూడేళ్లు నిండాయి. ఇందులో సర్పంచ్‌లతో పాటు ఎంపీటీసీ సభ్యులు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. పంచాయతీల్లో సాధారణ నిధులతో పాటు కేంద్రం ఇచ్చే ఆర్థికసంఘం నిధులు ఉంటాయి. కాబట్టి సర్పంచ్‌లకు గౌరవవేతనం విషయంలో పెద్దగా ఇబ్బంది ఉండదు. ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేకంగా ఎటువంటి అధికారాలు, నిధులు ఉండవు. అభివృద్ధి పనులకు జడ్పీ కేటాయించే అరకొర నిధులు తప్ప ఆర్థికంగా ఎటువంటి వెసులుబాటు ఉండదు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం కొంత వెసులుబాటుగా ఉంటుంది. వాస్తవానికి రాష్ట్ర విభజన నుంచి మైనర్ పంచాయతీ సర్పంచ్‌కి రూ.600, మేజర్ పంచాయతీ సర్పంచ్‌కి రూ.వెయ్యి, ఎంపీటీసీకి రూ.750, ఎంపీపీకి రూ.1,500, జడ్పీటీసీకి రూ.1,500 గౌరవ వేతనం ఉండేది. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాలను భారీగా పెంచింది. నెలకు రూ.3వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేలు, జడ్పీటీసీ, ఎంపీపీకి రూ.6వేలు గౌరవ వేతనం పెంచింది. టీడీపీ హయాంలో వారి గౌరవ వేతనాల కోసం మూడునెలలకు ఒకసారి నిధులు విడుదల అయ్యేవి. కాని వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికింది. 2021లో మండల పరిషత్ పాలకవర్గాలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ పరంగా మండల పరిషత్‌లకు పెద్దగా నిధులు విడుదల కాలేదు. కేంద్రం నుంచి వచ్చే నిధులు నేరుగా పంచాయతీలకు విడుదల కావడం మండల పరిషత్‌లకు నిధులు లేకపోవడంతో ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. అభివృద్ధి పనులు చేసేందుకు ఒక్క రూపాయి కూడా అందుబాటులో లేకపోవడంతో వారికి గుర్తింపు లేకుండా పోయింది.

గౌరవ వేతనం దక్కేనా

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది వరకు గౌరవ వేతనాలకు నిధులు విడుదల అయ్యాయి. ఆ తర్వాత నుంచి నిధులు ఇవ్వడం లేదు. ఎంపీటీసీలకు 2023, జనవరి వరకే గౌరవ వేతనాలు అందాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకు 20 నెలలుగా ఒక్కో సభ్యుడికి రూ.60 వేలు చొప్పున అందాల్సి ఉంది. ఎంపీటీసీగా గెలిచి మూడేళ్లు నిండాయి. ఇందులో మూడింట ఒకవంతు కాలానికి మాత్రమే గౌరవ వేతనం అందింది. నిధులు, గౌరవం ఎటూ లేవు. కనీసం గౌరవ వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వకపోవడం దారుణమని సభ్యులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ స్థానంలో అధికారంలోకి వచ్చిన కూటమి స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో తమ గౌరవ వేతనాలు, బకాయిలు, నిధులు విడుదల చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారు



వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. గ్రామానికి సేవ చేద్దామనే ఆశలతో, ఆశయాలతో ఎన్నికైన వారిని పట్టించుకోలేదు. కనీస ప్రాధాన్యం, గౌరవ వేతనం ఇవ్వలేదు. పంచాయతీ నిధులను దారి మళ్ళించి సొంత అవసరాలకు వాడుకుంది. సర్పంచ్‌లతో పాటు ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు. కూటమి ప్రభుత్వంలో మా సమస్యలు తీరడంతో పాటు బకాయిలు చెల్లిస్తుందనే ఆశాభావం ఏర్పడింది.

- కడలిగోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు

గౌరవ వేతనం ఇవ్వాలి



వైసీపీ ప్రభుత్వం ఒక్కో సభ్యుడికి కనీసం రూ.60 వేలు బకాయి పడింది. గతేడాది ఫిబ్రవరి నుంచి గౌరవ వేతనం ఇవ్వాలి. ఇప్పటికే ఎంపీటీసీగా మూడేళ్లు పూర్తి చేసుకున్నాం. కూటమిప్రభుత్వంపైనే తాము ఆశలు పెట్టుకున్నాం. తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడంతో తమ గౌరవ వేతనాలు, బకాయిలు తప్పనిసరిగా విడుదల చేస్తుందనే నమ్మకం ఉంది.

- ఉష, ఎంపీటీసీ నాచుగుంట



ఏలూరులో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు

‘టెట్’ పరీక్షకు 334 మంది హాజరు



ఏలూరు అర్బన్, అక్టోబరు 3 : ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్-2024) గురువారం ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ పరీక్ష కేంద్రంలో జరిగిన తొలిరోజు పరీక్షకు ఉదయం 186 మంది అభ్యర్థులకు 163 మంది, మధ్యాహ్నం పరీక్షకు 186 మందికి 171 మంది హాజర య్యారని డీఈవో అబ్రహం తెలిపారు. రెండు సెషన్లలో మొత్తం 38 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్ష ప్రశాం తంగా ముగిసిందని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని తెలిపారు. కాగా పరీక్ష కేంద్రం నగరానికి శివారు ప్రాంతంలో ఉండటంతో పరీక్షార్థులు సులువుగా చేరుకునేందుకు వీలుగా బస్టాండ్, సత్రంపాడు సెంటర్లలో ఫ్లెక్సీలను జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. డీఈవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్షగా టెట్‌ను నిర్వహిస్తుండగా, పరీక్ష నిర్వహణ బాధ్యతలను టీసీఎస్ సంస్థకు, పర్యవేక్షణ విధులను విద్యాశాఖకు కేటా యించారు. పరీక్ష సమయంలో కంప్యూటర్లు మొరాయించడం తదితర సమస్యలేవీ తలెత్తలేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. టెట్ పరీక్ష రాష్ట్ర పరిశీలకునిగా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిని జిల్లాకు నియమించారు.

రేపటి నుంచి భీమవరం, తాడేపల్లిగూడెంలో..

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 3 : భీమవరం,తాడేపల్లిగూడెం కేంద్రాల్లో ఈనెల 5, 6, 7, 13, 19 20వ తేదీలలో జరుగునున్న టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి కొన్ని సూచనలు చేశారు. ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు సెషన్-1, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు సెషన్-2 నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాల్‌టికెట్, గుర్తింపు కార్డుతో గంటన్నర ముందుగా చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో ఫోటో సరిగా లేనట్లయితే పాస్‌పోర్టు ఫోటో తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్‌లు, ఇయర్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. భీమవరం డీఎన్నార్, తాడేపల్లిగూడెం శ్రీవాసవీ ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్షలు జరుగుతాయన్నారు.

ఆస్తి ఇవ్వలేదని ఇంట్లోకి రానివ్వలేదు

ఆదరించేవారు లేక వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం
రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద అడ్డుకున్న స్థానికులు
స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి తరలించిన పోలీసులు



స్వర్ణాంధ్రకు వృద్ధురాలిని అప్పగిస్తున్న త్రీటౌన్ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3: ఆమె వయసు 75 ఏళ్లు.. కొడుకుల వద్ద కృష్ణా రామా అంటూ కాలక్షేపం చేయాల్సిన వయసు.. ఆస్తి ఇవ్వలేదనే కోపంతో కన్న కొడుకులు ఆమెను దూరం పెట్టారు.. ఇంట్లోకి రానివ్వలేదు.. ఆదరించే వారు లేకపోడంతో రాజమహేంద్రవరం పుష్కరాల రేవుకు చేరుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు అడ్డుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

వివరాల్లోకి వెళితే తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నానికి ముగ్గురు కుమారులు.. ఒక కుమార్తె. వారిని పెద్దచేసి పెళ్లిళ్లు చేసింది. ఇద్దరు కొడుకులకు ఇల్లు కట్టించి ఇచ్చారు. మూడేళ్ల క్రితం భర్త మరణించాడు. కుమారులలో ఒకరు మరణించడంతో అతని కుమార్తెను పెంచి తాను ఉంటున్న ఇంటిని ఆమెకు ఇచ్చేసింది. దీనిని తప్పుగా భావించిన ఇద్దరు కుమారులు, కోడళ్లు ఆమెపై కోపం పెంచుకున్నారు. నాగరత్నంకు వస్తున్న పెన్షన్‌తోనే జీవిస్తోంది. వయోభారంతో శరీరం పనిచేయకపోవడంతో కుమారులను ఆశ్రయం అడుగగా వారు దానికి ఒప్పుకోలేదు. ఈ వయసులో చూసే దిక్కు లేక కట్టుబట్టలతో గురువారం ఇల్లు వదిలి బస్సు ఎక్కి రాజమహేంద్రవరం చేరుకుంది. పుష్కరాలరేవు వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని లోపలికి వెళ్తుండగా స్థానిక చిరు వ్యాపారులు రక్షించి త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో తన బాధను పోలీసులకు చెప్పుకుంది. వారు ఆమెను లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి తరలించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇక్కడ 30 మంది వరకు ఉంటారని వారితో కలిసి ఉండటం వల్ల ఒంటరిననే భావన కలగదని అన్నారు. నాగరత్నం బంధువులు వస్తే పోలీసుల ద్వారా వారికి ఆమెను అప్పగిస్తామని చెప్పారు.



బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, రాట్నాలకుంట రాట్నాలమ్మ, మండపాక యల్లారమ్మ, పెనుగొండ వాసవీ శాంతిధామ్‌లో వాసవీ అమ్మవారు

బాలా త్రిపుర సుందరీ నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గురువారం అమ్మవార్లను పలు ఆలయాల్లో బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ప్రశిద్ధ ఆలయాలైన ద్వారకా తిరుమల కుంకుళ్లమ్మ, భీమవరం మావుళ్లమ్మ, ఆకివీడు పెద్దింట్లమ్మ, పెదవేగి రాట్నాలమ్మ, తాడేపల్లిగూడెం బలుసులమ్మ తదితర అమ్మవారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు.





జంగారెడ్డిగూడెంలో కలశాలతో గంగానమ్మ ఆలయానికి వెళుతున్న మహిళలు.. తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో పండ్లతో అలంకారం

క్రైమ్ కార్నర్

ఒంటరితనం భరించలేక వివాహిత ఆత్మహత్య

ఆకివీడు, అక్టోబరు 3 : ఒంటరి తనం తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆకివీడులో చోటు చేసుకుంది. ఆకివీడు చిన్నపల్లి వీధిలో ఉంటున్న కడ్ల నాగమణి (37) ఏడాది నుంచి ఒంటరిగానే ఒక అపార్టుమెంటులో అద్దెకు ఉంటున్నది. భర్త కృష్ణ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కుమారుడు తాళ్ళకోడులో ఉంటున్నాడు. విజయవాడకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ జానీతో పరిచయమేర్పడి కలుస్తూ ఉండడంతో భర్త, కుమారుడుకి తెలిసి మందలించారు. ఇటీవల జానీతో కూడా కలహాలు వచ్చాయి. ఒంటరితనం సహించలేక గురువారం తెల్లవారు జామున ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని తన తల్లి చనిపోయినట్లు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నాగరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి బలవన్మరణం

లింగపాలెం, అక్టోబరు 3:పురుగుమందు తాగి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. లింగపాలెం మండలం ధర్మాజిగూడెం గ్రామానికి చెందిన డి.పానకాలరావు (68) 30 సంవత్సరాలుగా మతి స్థిమితం లేక తిరుగుతున్నాడు. ఈనెల 2వ తేదీన పురుగుమందు తాగి స్పృహ కోల్పోగా స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు తెలియజేశారు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉంగుటూరు, అక్టోబరు 3 :మండలంలోని చేబ్రోలు గ్రామంలో తుమ్మపాల సుభాష్ చంద్రబోస్ (40)విద్యుదాఘాతంతో మృతి చెందాడు.స్థానిక కోట్లమ్మ గుడి సమీపంలో మోటారు స్విచ్ వేయడంతో విద్యుత్తు షాక్ కొట్టడంతో ఒక్కసారిగా కుప్ప కూలి మృతిచెందాడు. భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని మున్సిపల్ కార్మికురాలి మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 3 : లారీ ఢీకొట్టడంతో భీమవరం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న మహిళ మృతి చెందినట్టు భీమవరం వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. చినరంగని పాలెం పుంతకు చెందిన బంగారు రవణమ్మ (56) 30 సంవత్సరాలుగా మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. గురువారం ఉదయం ఆమె చిన్నకుమారుడు శివకుమార్‌తో కలిసి మస్టర్ వేయించుకునేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. సరిగ్గా ఓవర్ బ్రిడ్జిపైకి వెళ్ళేసరికి పాలకొల్లు వైపు నుంచి భీమవరం వైపు వస్తున్న లారీ వెనుక నుంచి వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కిందపడిపోయారు.రవణమ్మకు తీవ్ర గాయాలయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఆమె పెద్దకుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, అక్టోబరు 3 : భర్త, అతని బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన పుసులూరి స్వాతి రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. స్వాతికి విజయవాడ సింగ్ నగర్‌కు చెందిన పుసులూరి వీరాంజనేయులుతో మూడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా భర్త, అత్త, మామ, మరిది, భర్త స్నేహితుడు కట్నం తీసుకురమ్మని వేధిస్తూ ఉండటంతో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌బీ మహేశ్వరరావు తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, అక్టోబరు 3 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో దాడి చేసి ఒక బొలేరో, ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై కట్టా సతీష్ తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కోళ్లవ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించామన్నారు. చెరువు యజమానులతో పాటుగా వాహన యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

ఏలూరు క్రైం, అక్టోబరు 3 : మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం గాంధీ జయంతి సందర్భంగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా భీమడోలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండుగొలను వద్ద బొల్లం దుర్గారావు అనే వ్యక్తి 22 మద్యం సీసాలు తీసుకు వెళుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. పాండిచ్చేరి రాష్ట్రం నుంచి ఈ మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చినట్లుగా గుర్తించామన్నారు. అతడిని అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేర్వేరు సంఘటనల్లో
చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 3 : మానసిక స్థితి సరిగాలేక ఒక వృద్ధుడు పురుగుమందు తాగి తీవ్ర అస్వతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగపాలెం మండలం ధర్మాజీగూడానికి చెందిన దేవినేని పానకాలరావు (73) గత కొంత కాలం నుంచి మానసిక అరోగ్యానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 2వ తేదీన పురుగు మందుతాగాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మద్యం మత్తులో పురుగుమందు తాగి..

మద్యం మత్తులో ఒక యువకుడు పురుగుమందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆచంటలోని చినపేటకు చెందిన బోడా నాగరాజు (30) మద్యం ఎక్కువగా తాగుతూ ఉంటాడు. మద్యం మత్తులో ఈనెల 2వ తేదీన కలుపుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కడుపునొప్పి భరించలేక పురుగుమందు తాగి..

కడుపునొప్పి భరించలేక ఒక వ్యక్తి పురుగుమందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్వారకాతిరుమల మండలం లైనుపక్క బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన గాంధీ (46) కొంత కాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధ భరించలేక గతనెల 30వ తేదీన పురుగుమందు తాగాడు.ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్కపై తమ్ముడి దాడి



కత్తితో దాడి చేసేందుకు వెళుతున్న యోసేబును అడ్డుకుంటున్న స్థానికులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 3 :తల్లితో తరచూ గొడవ పడి కొడుతోందని కోపోద్రిక్తుడైన తమ్ముడు తోడబుట్టిన అక్కపై కత్తితో దాడి చేసిన ఘటన గురువారం జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన ఇరవై ఏళ్ళ దారా యోసేబు తాపీ పనులు చేసుకుంటూ స్థానిక శ్రీనివాసపురం రోడ్డులో తల్లితో కలిసి నివాసముంటున్నాడు. యోసేబు అక్క ఎస్తేరురాణి తన భర్త సరిగా చూడడం లేదని ఇటీవల తల్లితో ఉంటున్నది. ఎస్తేరు రాణి కొద్ది రోజుల క్రితం తన తల్లితో గొడవ పడి కొట్టి గాయపరిచింది. గురువారం కూడా తన తల్లితో గొడవ పడి కొట్టి ఇంటి నుంచి బయటికి వెళ్ళిపోయింది. సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన కుమారుడికి కుమార్తె గొడవపడి కొట్టిందని తల్లి చెప్పగా యోసేబు కోపోద్రిక్తుడై తన ఇంటిలో ఉన్న మొండి కత్తి తీసు కుని తన అక్కకోసం పట్టణంలో పలుచోట్ల వెతికాడు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం రోడ్డుపై నడుస్తూ వస్తున్న అక్క ఎస్తేరురాణిను చూసి వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఎస్తేరు రాణి తలపై, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు యోసేబు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాయపడిన ఆమెని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కు తీవ్రగాయాలు

ఉండి అక్టోబరు 3: రోడ్డుప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్‌కి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరు సంతపేటకు చెందిన రమేష్ ఉండి ప్రాంతంలో పనుల నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఉండి పాలకేంద్రం సమీపానికి వెళ్లేసరికి ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. అతని వద్ద సమాచారం తీసుకుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. 108కు సమాచారం అందించి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ మండపం అప్పగింత



మంత్రికి జ్ఞాపికను బహుకరిస్తున్న నారాయణరావు కుటుంబ సభ్యులు

ఆగిరిపల్లి, అక్టోబర్ 3: ఆగిరిపల్లి శోభనాచల స్వామి ఆలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన కల్యాణ మండపం దేవస్థాన అధికారులకు దాతల కుటుంబ సభ్యులు అప్పగించారు. ఆగిరిపల్లి ప్రముఖ వ్యాపారవేత్త కీర్తిశేషులు మదుపల్లి నారాయణరావు సొంత ఖర్చుతో నిర్మించిన కల్యాణ మండపాన్ని మంత్రులు కొలుసు పార్థసారథి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నామమాత్రపు అద్దెతో ఈ కల్యాణ మండపాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఘాట్‌రోడ్డు ఇక్కడి ప్రాంతవాసుల కలని తనకు ఈ ఘాట్ రోడ్డు వేయించే అవకాశం దక్కిందన్నారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇంత ఖర్చుతో కల్యాణ మండపాన్ని కట్టి భక్తుల సౌకర్యార్థం దానం చేసిన మదుపల్లి వారి కుటుంబానికి భక్తులు రుణపడి ఉంటారని కొనియాడారు. మంత్రులకు కల్యాణ మండపం దాత నారాయణరావు కుటుంబ సభ్యులు లక్ష్మి నరసింహని మెమోంటోలు బహూకరించారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థాయికి ఎదగాలి



ప్రసంగిస్తున్న లయన్ కోటిరెడ్డి

ఆగిరిపల్లి, అక్టోబర్ 3: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, లయన్స్‌క్లబ్ ఆఫ్ బెజవాడ పూర్వపు జిల్లా గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి అన్నారు. ఏపీ లయన్స్ సేవా యజ్ఞంలో భాగంగా తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ సెకండరీ కాలేజి స్థాయి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన యువజన సాధికారిత శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ కార్యదర్శి లయన్ డాక్టర్ కె.ధీరజ్, తన కుమారుడు మాస్టర్‌శౌర్యధీర్ పుట్టిన రోజు సందర్భంగా హీల్ ప్యారడైజ్ బాలలందరికి అన్నవితరణ గావించారు. లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ కేవీ రామారావు, లయన్ బి.శ్రీనివాస రావు, లయన్ బి.కోటేశ్వరరావు, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, క్యాంపస్ చైర్మన్ పి.ధనప్రకాష్, సీఈవో కె.అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యురాలు యు.మణికుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



డాన్స్ చేస్తున్న విద్యార్థినిలు

కైకలూరు, అక్టోబరు 3: కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో విద్యనభ్యసించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని చెడు అంశాలవైపు దృష్టి మరల్చకుండా విద్యపైనే కేంద్రీకరించి కళాశాలకు మంచిపేరు తేవాలన్నారు. సాంప్రదాయబద్ధంగా వస్తున్నటువంటి ఫ్రెషర్స్ డేలో సీనియర్ విద్యార్థులు కొత్త వారితో సోదరభావంతో ఉండాలన్నారు. టీచర్స్ డేను పురస్కరించుకొని అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థినిలు ఆటపాటలతో అలరించారు.

200 మందికి వైద్య పరీక్షలు



వేల్పుచర్లలో నిర్వహించిన వైద్య శిబిరం

ముసునూరు, అక్టోబరు 3: మండలంలోని వేల్పుచర్లలో సర్పంచ్ పుట్ల మోహనరావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ప్రభ ఆస్పత్రి వైద్యులు సునీల్‌సందీప్, ఫిరోజ్ సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందిని మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రి రిఫర్ చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఉప సర్పంచ్ పటాపంచల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గరికిముక్క సుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు మానం ఘంటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యుడిగా నాగరాజు



ముదినేపల్లి, అక్టోబరు3 : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అమ్మవారి దేవీశరన్నవరాత్రుల ఉత్సవ కమిటీలో ముదినేపల్లి మండలంలోని టీడీపీ నాయకుడికి చోటు దక్కింది. అల్లూరు గ్రామానికి చెందిన కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు ఉత్సవ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు సభ్యుడిగా వ్యవహరిస్తారు.

భారీ వర్షం.. విరిగిన చెట్లు



మండవల్లి, అక్టోబరు 3: బుధవారం రాత్రి మండవల్లి ప్రాంతంలో అకాల వర్షం భారీగా కురిసింది. అకస్మాత్తుగా ఎవరు ఊహించని రీతిలో ఉరుములు, మెరుపులు గాలులతో భారీ వర్షం కురి సింది. దీంతో వాహనదారులు సైతం ఎక్కడివారు అక్కడే సుమారు మూడు గంటలపాటు నిలిచి పోవాల్సి వచ్చింది. మండవల్లిలో 28.4 మిల్లీ మీటర్లు వర్షం నమోదైందని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్ గురువారం తెలిపారు. మండవల్లి సమీపంలోని 165 జాతీయ రహదారిపై భారీ చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



ఎలక్ట్రానిక్ వస్తువులపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

కైకలూరు, అక్టోబరు 3: దసరా సెలవుల్లో ఒకేషనల్ విద్యార్థులు కొరకు ఇంటర్న్‌షిప్ ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువులపై అవగాహన పెంచుకోవాలని హెచ్‌ఎం ముబీన్ భాను అన్నారు. గురువారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కోర్సును ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంచుకోవాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో ఎలక్ట్రికల్ వస్తువులపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో జీవనోపాధికి అవకాశం కలుగుతుందన్నారు. ఒకేషనల్ ఉపాధ్యాయినీ మహ్మద్ నేహా పాల్గొన్నారు.

కొలువుదీరిన అమ్మవార్లు

శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కామినేని



ముదినేపల్లి చేవూరుపాలెంలో...



కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, అక్టోబ రు 3: దసరా ఉత్సవాలతో కైకలూరు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీచండీ మహాయాగ సహిత శరన్నవరాత్రి మహోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఆలయంలో గోపూజ చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీశ్యామలాంబ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కూటమి నాయకులు బొమ్మన బోయిన విజయలక్ష్మీ, పెన్మెత్స త్రినాధరాజు, నర్సిపల్లి అప్పారావు, పూల రామచంద్ర రావు, వేంపాటి విష్ణురావు, పేరిచర్ల ప్రసాదరాజు, పొత్తూరి వాసురాజు, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, కొల్లి వరప్రసాద్, కట్టా వీరరాఘవులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయాధికారి వీఎన్‌కె శేఖర్, పాల్గొన్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. అమ్మవారు శ్రీకన్యాకుమారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు. కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనిమిచ్చారు.

● మండవల్లి : మండలంలోని లోకుముడి గరువులోని శ్రీదత్త ఆశ్రమంలో దేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఎగ్జిక్యూటివ్ జి.ఉదయశంకర్ దంపతులు కోటి కుంకు మార్చన నిర్వహించారు. శ్రీరామ్‌నగర్‌లోని శివగులకలమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరీ దేవీగా అలంకరించారు. మండవల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు.

● కలిదిండి : సంతోషపురంలో కనకదుర్గమ్మను బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మూల్లంక, గుర్వాయిపాలెం, కోట కలిదిండి గ్రామాల్లో కనకదుర్గమ్మ అమ్మవారిని పూలమాలలు అలంకరించి భక్తులు పూజలు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



ముసునూరు రామాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

● ముదినేపల్లి : పెయ్యేరు ఏరియాలోని మండల కార్యాల యాల వద్ద వేంచేసి ఉనకనక దుర్గ మ్మ ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవపూడిలోని విజయదుర్గాదేవి ఆలయంలో, చేవూరు పాలెంలోని పరసా అంకమ్మ తల్లి ఆయలయాల్లో భవానీ దీక్షా పరులు పూజలు చేశారు.

● ముసునూరు : తొలిరోజు అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ముసునూరు పడమట రామాలయం, శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాలతోపాటు రైస్‌మిల్లు సెంటర్‌లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించగా, అమ్మవారిని శ్రీ బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోపవరంలో ఆంజనేయస్వామి ఆలయం, నాగేంద్రపురం సెంటర్‌లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. బలివే శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో భక్తులకు సిబ్బంది తీర్థప్రసాదాలను అందజేశారు.

● నూజివీడు టౌన్: ఆంధ్రా మైసూరుగా పేరు గాంచిన నూజివీడు దసరా ఉత్సవాల నేపథ్యంలో కోట మహిషాసుర మర్థిని అమ్మవారు శరన్నవరాత్రుల తొలి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● చాట్రాయి : చాట్రాయి కనకదుర్గమ్మ ఆలయం, శివాలయం, సీ గుడిపాడు శివాలయం, చాట్రాయి, ఆరుగొలనుపేట, చనుబండ, బూరుగ్గూడెం, పోతనపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారు బాలాత్రిపునసుందరిగా దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలా త్రిపురసుందరీదేవిగా దర్శనం



కలిదిండి సంతోషపురంలో...



మండవల్లి మండలం ఇంగిలిపాకలంకలో..



నూజివీడులో..



చాట్రాయి ఆరుగొలనుపేటలో..

బ్యాంకు సేవల జాప్యంపై నిలదీత



బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నిస్తున్న ఏసురాజు

కైకలూరు, అక్టోబరు 3: బ్యాంకులో ఖాతాదారులందరికి అన్ని రకాల సేవలు అందించాలని లేకుంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర వడ్డీ సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. కైకలూరు మండలం ఆలపాడులోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ దృష్టికి గురువారం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీసుకువెళ్లారు. కొల్లేరు గ్రామాల నుంచి డ్వాక్రా మహిళలు ప్రతీ నెలా బ్యాంకు ఖాతాలో తమ డబ్బులు చెల్లించేందుకు వస్తున్నారని డబ్బు చెల్లించిన తరువాత పాసుపుస్తకాల్లో ఎంట్రీలు వేయకపోవడంతో డబ్బులు జమయ్యేది లేనిది తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఒక మహిళ రూ.70 లక్షలు అపహరణ చేసిందన్నారు. అలాగే అనేక వివాదాలు వెలుగులోకి రాకుండా పోయాయయన్నారు. పాసు పుస్తకాల్లో ఎంట్రీలు వేసేందుకు రెండు లేదా మూడు నెలలు సమయం తీసుకుంటున్నారని ఎప్పటికప్పుడు ఎంట్రీలు వెయాల్సి ఉన్నా బ్యాంకు అధికారులు పదేపదే మహిళలను బ్యాంకు చుట్టూ తిప్పించుకోవడంపై ఏసురాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళలు డబ్బులు చెల్లించిన వెంటనే వారి పాసు పుస్తకాల్లో ఎంట్రీ వెయ్యాలని కోరారు. ప్రస్తుతం ఎంట్రీ వేయకపోవడంపై ఆరా తీసి బ్యాంకు మేనేజర్ ఎస్. రామినాయుడు నిలదీశారు. బ్యాంకులో ప్రింటర్ పనిచేయటం లేదని దీనిపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చానని త్వరలోనే మరమ్మతులు నిర్వహించి ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. అయితే డ్వాక్రా మహిళలు సక్రమంగా డబ్బు చెల్లించేది లేనిది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని లేకుంటే వడ్డీలు కట్టేందుకే వారి సంపాదన సరిపోతుందని డ్వాక్రా సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పావాల వడ్డీ వర్తించే విధంగా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. కొల్లేరు సంఘ నాయకులు జయమంగళ సుబ్బరాజు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సొంత పిల్లల్లా చూసుకోవాలి

కలెక్టర్ వెట్రిసెల్వి



అంగన్‌వాడీ చిన్నారులతో కలెక్టర్ వెట్రిసెల్వి

ఆగిరిపల్లి, అక్టోబర్ 3: అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను తన సొంత పిల్లల్లాగా ఆదరించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ఆగిరిపల్లిలోని నెంబర్ ఫైవ్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను తెలుసుకున్నారు. పిల్లలు తినే భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు నేర్పిస్తున్న గేయాలు కలెక్టర్ ఆలకించారు. పిల్లల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య లోపాలు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు తెలియచేసి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించాలని తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆగిరిపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు పరిష్కారాల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి, తహసీల్దార్ ప్రసాద్ ఉన్నారు.

6న ఉచిత వైద్య శిబిరం

కైకలూరు, అక్టోబరు 3: ఓమౌజయః ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఓమౌజయంఃఓంనమోస్తుతే క్షేత్రం సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కైకలూరు ఎన్జీవో హోంలో జనరల్ మెడిసిన్, స్త్రీ సంబంధిత వైద్యం, జనరల్ సర్జరీ, ఎముకలు, కంటి, పంటి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7, 8 తేదీల్లో రాష్ట్ర స్థాయి డీఆర్పీలకు శిక్షణ

ఏలూరు అర్బన్, అక్టోబరు 3 : పాఠశాల నిర్వహణ కమిటీ(ఎస్‌ఎంసీ)లకు ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులకు విధులు, బాధ్యతలపై మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేక్రమంలో తొలుత ఒక్కో జిల్లానుంచి ఐదుగురు సభ్యులతో కూడిన జిల్లా రిసోర్స్ పర్సన్లకు(డీఆర్పీ) రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 7, 8 తేదీల్లో రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించనున్నారు. శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు ఎంపిక చేసిన డీఆర్పీల బృందాలకు జిల్లాలోని ఆగిరిపల్లి హీల్ ప్యారడైజ్ స్కూలు వేదికగా ఈ శిక్షణ జరుగనుంది. ఒక్కో డీఆర్పీ బృందంలో ముగ్గురు టీచర్లు, ఇద్దరు ఎస్ఎంసీల చైర్‌పర్సన్లు ఉంటారు. రాష్ట్ర స్థాయి శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత వీరంతా సంబంధిత జిల్లాల్లో మండల స్థాయిలో ఎస్ఎంసీ ప్రతినిధులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఏలూరు జిల్లాకు సంబంధించి మొత్తం 1,842 ఎస్ఎంసీలు ఈ ఏడాది ఆగస్టులో ఏర్పాటైన సంగతి విదితమే. రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమానికి సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయ అధికారి లక్షణ్, వెంకటరమణ హాజరవుతారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటమే లక్ష్యం



చనుబండలో నిర్వహిస్తోన్న పొలం పిలుస్తోంది కార్యక్రమం

చాట్రాయి, అక్టోబరు 3: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నదని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఆచరించే రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ పథకాలను రైతులకు వివరించారు. ఏవో శివశంకర్ మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు తగు మోతాదులో వాడి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. పంటలకు తెగెళ్ళు సోకితే ఖచ్చితంగా హెక్సాకోనోజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. దోమ ఉధృతంగా ఉంటే పైమెట్రోజైన్ 120 గ్రాములు లేదా అసిఫేట్ 75 శాతం డబ్ల్యుపీ 350 గ్రాములు 350 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నాయకులు కందుల కృష్ణ, గవర వెంకటేశ్వరరావు, చిమటబోయన పుల్లారావు, విస్సంపల్లి రాజా పాల్గొన్నారు. ఏవో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులను రైతులకు దగ్గర చేసేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అలాగే రైతులను అన్ని విధాల అదుకునేందుకు సబ్సిడీపై అనేక పథకాలను అందిస్తుందన్నారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, జీవన ఎరువులను వాడాలని సూచించారు. అలాగే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించేలా సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని ఏవో కోరారు. టీడీపీ నాయకులు ఆముదాల ఇసాక్, రంగు శ్రీనివాసరావు, ఉప్పే శివరామకృష్ణ, సాయిల నాని, వల్లూరి సతీష్, పాశం వెంకటేశ్వరరావు, నామాల సత్యనారయణ, మిద్దె నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ముసునూరు : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అనేక పథకాలను అమలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధు మోహన్ అన్నారు. రమణక్కపేట సచివాలయంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఆశ వర్కర్ల ధర్నా



నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

కలిదిండి, అక్టోబరు 3 : తమపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన టి.నరసాపురం మండలం గంగిగూడెం ఆశా వర్కర్ లక్ష్మీ మంగను విధుల్లోకి తీసుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మూల్లంక పీహెచ్‌సీ వద్ద గురువారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ వేధింపులకు గురి చేయటం సరికాదన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. యూనియన్ నాయకులు డి.విజయ, రమాదేవి, ఎం.కాంతామణి, విమల, ఎస్.సువర్ణ, జోసుదా కుమారి, బి.ఝాన్సీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : రాజకీయ జోక్యాన్ని నివారించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు అర్బన్ పీహెచ్‌సీ వద్ద ఆశ వర్కర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నూజివీడు కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ టి.నర్సాపురంలోని ఆశ వర్కరు కె.లక్ష్మి మంగను రాజకీయ ఒత్తిడిలతో అక్రమంగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని అక్కడ రాజకీయ ఒత్తిడిలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు కమల, నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు మూడు దరఖాస్తులు

నూజివీడు టౌన్, అక్టోబరు 3: నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 16 వైన్ షాపులకు గురువారం సాయంత్రానికి మూడు అర్జీలు దాఖలైనట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ నెల తొమ్మిదోవ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో 16 షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చనినా ఆయన తెలిపారు. ఇతర వివరాలకు నూజివీడు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కోతుల భయం



కోతుల భయంతో నిర్మానుషంగా ఉన్న రోడ్డు

ముదినేపల్లి, అక్టోబరు 3 : మండలంలోని అంబేడ్కర్ నగర్ వాసులను వానరాలు భయకంపితులను చేస్తున్నాయి. ఇళ్లల్లో నుంచి బయటికి రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. మంగళవారం ఓ మహిళపై కోతుల గుంపు దాడి చేయడంతో తీవ్రగాయాలకు గురి చేసిన ఘటనతో అంబేడ్కర్‌నగర్ వాసులు తలుపులు తెరవాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుషంగా మారాయి. కొంతమంది వ్యక్తులు కర్రలతో బజార్లలో కాపలా ఉంటున్నారు. పిల్లలు పాఠశాలలకి వెళ్లే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇలా అయితే ఎలా..

కోతులు గృహాల్లోకి ప్రవేశించటం, రోడ్లపై వెళ్లే వారిపై దాడి చేసి కరవటం లాంటి పరిస్థితుల్లో మేము ఎలా జీవించాలి. తలుపులు మూసేసి ఎన్నాళ్లు ఇళ్లల్లో ఉండాలి. పంచాయతీ అధికారులు అంబేడ్కర్ నగర్ నుంచి కోతులను తరిమే కార్యక్రమం చేపట్టాలి. అందుకు మేము సహకరిస్తాం.

- సేవా నాగభూషణం, అంబేద్కర్ నగర్ వాసి

బదిలీ అయిన అధికారులకు సన్మానం



బదిలీ అయిన అధికారులను సత్కరిస్తున్న ముదినేపలి ఎంపీపీ సత్యనారాయణ, సిబ్బంది

ముదినేపల్లి, అక్టోబరు 3 : ముదినేపల్లి మండలం నుంచి బదిలీ అయిన అధికారులకు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కో లు పలికారు. కృష్ణా జిల్లా నందివాడ మండలానికి బదిలీ అయిన ముదినేపల్లి ఎంపీడీవో మల్లీశ్వరి, కృష్ణా జిల్లా పరిషత్తు కార్యాలయానికి బదిలీ అయిన మండల పరిషత్తు కార్యాలయ ఏవో రమణబాబు, నిడదవోలు బదిలీ అయిన ఈవోపీఆర్డీ డి.లక్ష్మినారాయణను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఇతర అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు,కార్యాలయ సిబ్బంది సన్మానించి అభినందించారు.

● ఆగిరిపల్లి : మండలంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బదిలీల అయిన సిబ్బందికి అభినందన సభ నిర్వహించారు. ఇప్పటివరకు ఏపీఎంగా బాధ్యతలు నిర్వహించిన బి.రామకృష్ణను సిబ్బంది సన్మానించారు. అలాగే బదిలీల పై వెళుతున్న వారిని కూడా ఘనంగా సన్మానించారు. బీఓఏలు, క్లస్టర్లు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మసకబారుతున్న దసరా ఉత్సవాల ప్రభ

నూజివీడు టౌన్, అక్టోబర్ 3: ఆంధ్రా మైసూరుగా పేరుగాంచిన నూజివీడు దసరా ఉత్సవాల ప్రభ నానాటికి మసకబారుతోంది. సుమారు 400 ఏళ్ల చరిత్ర గల కోటమహిషాసురమర్ధిని ఆలయ చరిత్రలో ఏనాడు దసరా ఉత్సవాల నిర్వహణకు వేరేవారి గడప తొక్కిన పరిస్థితి లేదు. అయితే ప్రస్తుత ఉత్సవాల నిర్వహణకు చందాల పేరుతో వ్యాపారస్తుల దగ్గరకు వెళ్లబోయిన దేవాదాయ శాఖకు చేదు అనుభవం సైతం ఎదురైంది. నూజివీడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవోగా కొద్దికాలం క్రితం నియమించిన వ్యక్తికి ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి అనుభవం లేదు. ఆమె తొలి పోస్టింగ్ ఇక్కడే అవ్వడంతో దసరా ఉత్సవాల నిర్వహణకు అనుభవం ఉన్న మరో అధికారిని పర్యవేక్షణకు నియమించవలసి ఉండగా, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. మరోవైపు శరన్నవరాత్రులు తొలిరోజే ఆమె సెలవు పై వెళ్లడంతో ప్రస్తుత దసరా ఉత్సవాల నిర్వహణ పై భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక దేవాలయంలో ఉత్సవాల సమయంలో నిర్వహించే కార్యక్రమాలకు ప్రతి సంవత్సరం టెండర్ నిర్వహించవలసి ఉండగా, ఎటువంటి టెండర్లు పిలవకుండానే దేవాదాయ శాఖ అధికారులు పనులు అప్పగించడంపైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

క్రైం కార్నర్..

యువకుడిపై కత్తితో దాడి



కత్తిపోట్లకు గురైన సాయి

ముదినేపల్లి, అక్టోబరు 3 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి మరో యువకుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం పెనుమల్లి శివారు సింగవరం గ్రామానికి చెందిన బస్తాటి సాయి, అదే గ్రామానికి చెందిన గోట్రు వీర బాబు కుటుంబాల మధ్య కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి గురజ గ్రామ సెంటర్‌లో మషాలా బండి వద్ద ఉన్న సాయిపై వీరబాబు కత్తితో దాడి చేసి అతడిని తీవ్రంగా గాయపర్చాడు. శరీరంపై పలు చోట్ల కత్తితో పొడిచాడు. వెంటనే క్షతగాత్రుడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ఎస్‌ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి, అక్టోబరు 3: మండలంలోని పోతనపల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం రాత్రి దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకొని, ఆరు బైక్‌లు, రూ 29,540 నగదు స్వాధీనం చేసుకుసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.రామకృష్ణ తెలిపారు.

● ముదినేపల్లి : ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో బుధవారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహణపై అందిన సమాచారం మేరకు ఎస్.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ దాడి నిర్వహించారు.